నేడు హైదరాబాద్‌లో క్రిస్మస్ వేడుకలకు రండి

సిఎం రేవంత్‌రెడ్డికి మంత్రి అజహరుద్దీన్ ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని మంత్రి అజహరుద్దీన్, క్రిస్టియన్ మైనార్టీ నేతలు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు హాజరు కావాలంటూ ఆయనకు ఆహ్వానపత్రికను అందజేశారు. ఏటా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. క్రిస్టియన్ మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతతోపాటు వారి కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి సీఎం ప్రకటిస్తారు. వారి సమస్యల గురించి తెలుసుకుంటారు. భవిష్యత్తులో చేపట్టబోయే చర్యల గురించి వివరిస్తారు.

పుస్తక పఠనం తగ్గినందునే సమాజంలో అశాంతి, అసాంఘిక కార్యక్రమాలు

- ఉత్సాహభరితంగా బుక్ ఫెయిర్ ఆరంభం

ప్రజాశక్తి - కల్చరల్

పుస్తక పఠనం తగ్గి డిజిటల్ మీడియా వ్యాప్తి కావడం వల్ల సమాజంలో అశాంతి, అసాంఘిక కార్యక్రమాలు పెరుగుతున్నాయని రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు అవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఎం టి ఆర్ స్టేడియం లో 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ను ప్రారంభించి మంత్రి మాట్లాడారు. ప్రతి మండలంలో ఇటువంటి బుక్ ఫెయిర్ ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పుస్తకాలు తీసుకెళ్లాలన్నారు . ఇందుకు సాంస్కృతిక శాఖ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్య అంటే కేవలం పాఠ్య పుస్తకాలు చదవటం కాదు అని మనిషి సంస్కారం పెంచుకునేదే విద్య అర్థం అన్నారు పేదరికం సమస్య కాదు లక్ష్యం కోసం పని చేసిన ఎందరో పెద్దలు పుస్తకాలు చదివి గొప్ప పరిశోధనలు చేసి ప్రపంచ అభివృద్ధి కి దోహదం చేశారు అని చెప్పారు ప్రతి ఇల్లు గ్రంథాలయం కావ లని ముందుగా వార్త పత్రికలు చదవటం ప్రారంభించాలని అని సూచించారు పుస్తక ప్రదర్శన రాష్ట్రం అంతా ఏర్పాటు చేసే ప్రణాళిక ఆరంభిస్తేము అని చెప్పారు బుక్ ఫెయిర్‌కి 15 లక్షల మంది వీక్షకులు వస్తారూ అనే అంచనా విశేషం అని అభినందించారు వేదిక పై ప్రొఫెసర్ కోదండరాం సీనియర్ సంపాదకుడు కె రామచంద్ర మూర్తి సంస్కతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి బుక్ ఫెయిర్ సొసైటీ కార్యదర్శి వాసు నివేదిక ప్రకటించగా అధ్యక్షుడు యాకూబ్ అధ్యక్షత వహించారు.

'సర్'తో రాజ్యాంగ హక్కులకు ప్రమాదం

- బీహార్‌లో 35 లక్షల మంది మహిళల ఓట్ల తొలగింపు
- వలసల సాకుతో ఆడవాళ్ల అణచివేత : ది హిందూ డిప్యూటీ ఎడిటర్ శ్రీనివాసన్ రమణి
- అక్టోబర్ విప్లవంలోనే రష్యాలో మహిళలకు ఓటు : రిటైర్డ్ జడ్జి రజని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



భారత ప్రభుత్వం చేపట్టిన 'సర్' ప్రక్రియతో రాజ్యాంగ హక్కులకు ప్రమాదమేర్పడిందని ది హిందూ ఆంగ్ల దినపత్రిక జాతీయ ఉప సంపాదకులు శ్రీనివాసన్ రమణి ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క బీహార్‌లోనే రకరకాల కారణాలతో 65 లక్షల ఓట్లను తొలగిస్తే అందులో మహిళలవి 35 లక్షలు ఉన్నాయని గుర్తు చేశారు. వలసల సాకుతో మహిళల అణిచివేత కొనసాగుతున్నదని వ్యాఖ్యానించారు. తద్వారా సాధారణ ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులకు రక్షణ లేకుండా పోతున్నదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్‌వికెలో సుశీలా గోపాలన్ స్మారక ట్రస్ట్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో "భారతదేశంలో మహిళా ఓటర్లు:సవాళ్లు,మినహాయింపులు, ఓటింగ్ సరళి' అనే అంశంపై ఎనిమిదో సుశీలా గోపాలన్ స్మారకోపన్యాసం నిర్వహించారు. దీనికి సుశీలా గోపాలన్ స్మారక ట్రస్ట్ చైర్‌పర్సన్ కీర్తి సింగ్ అధ్యక్షత వహించగా సుశీలా గోపాలన్ స్మారక ట్రస్ట్ కార్యదర్శి సుధా సుందరరామన్, ట్రస్టీ ఎస్.పుణ్యవతి, ఐద్వా తెలంగాణ ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసన్ రమణి మాట్లాడుతూ బీహార్‌లో విదేశీయులు ఎక్కువగా ఉన్నారంటూ భారత ఎన్నికల సంఘం సర్ ప్రక్రియ చేపట్టిందని చెప్పారు. ఎక్కడ ఓటు ఉంటే అక్కడే వేసే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం తిరస్కరిస్తున్నాయని గుర్తు చేశారు. చనిపోయారని, స్థానికంగా లేరని, వలసపోయారని, డూప్లికేటు ఓటర్లు ఉన్నారని మహిళలను రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించకుండా, హక్కును ఉపయోగించుకోకుండా చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అది తప్పని వాదించారు. 18 నుంచి 29 వయస్సున్న ఓటర్లలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారని, వారి ఓట్లను ఇష్టానుసారం తొలగిస్తున్నారని చెప్పారు. కుటుంబ ఆస్తుల తగాదాలు, అత్తింటికి వెళ్లడం కూడా కారణాలుగా చూపిస్తున్నారని వివరించారు. నిజానికి ఇలా జరగకూడదని అభిప్రాయపడ్డారు. బీహార్ రాష్ట్రంలో తమ జర్నలిస్టుల బృందం పర్యటించిన నివేదికలో అనేక అక్రమాలు వెలుగు చూశాయని వివరించారు. నిరక్షరాస్యులుగా ఉన్న 40 నుంచి 50 శాతం మంది మహిళల దరఖాస్తులను ఈసీ తిరస్కరించినట్టు చెప్పారు. బీహార్‌తోపాటు ఝార్ఖండ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. కేరళలో మహిళల్లో అక్షరాస్యత ఎక్కువగా కాబట్టి అక్కడ పరిస్థితి మెరుగ్గా ఉందని చెప్పారు. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లో సమస్యలు ఉన్నాయని అన్నారు. వలసలు పోయిన వారిలో పురుషులు ఎక్కువగా ఉంటే, తొలగించిన వారిలో మహిళలే ఎక్కువ ఉన్నారని వివరించారు. కేవలం ఉచిత బస్సు పథకాలతోనే మహిళలకు సాధికారత రాదని గుర్తు చేశారు. తాత్కాలిక రుణ పథకాలు కాకుండా శాశ్వత ప్రాతిపదికన మహిళలకు ఉపాధి అవకాశాలు కేరళలోని కుటుంబ శ్రీ పథకం వస్తున్నాయన్నారు. ఓటు హక్కును కోల్పోతున్నవారిలో పేదలు, మహిళలు ఎక్కువగా ఉంటున్నారని అన్నారు. ఈ విషయాన్ని సీతారామ్ ఏచూరి ఎక్కువగా చెప్పేవారని గుర్తు చేశారు. మహిళల అవకాశాలు, హక్కులను హరిస్తున్న కేంద్రంతోపాటు భారత ఎన్నికల సంఘం చర్యలను ఖండించాలని చెప్పారు. సర్‌ను అడ్డంపెట్టుకుని దేశవ్యాప్తంగా 2.3 కోట్ల ఓటర్లను జాబితాలనుంచి తొలగించారని చెప్పారు.

1917లోనే రష్యాలో మహిళలకు : ఓటు హక్కురిటైర్డ్ జడ్జి టి రజని

1917లో సోవియేట్ రష్యా విప్లవంలోనే అక్కడ మహిళలకు పురుషులతోపాటు ఓటుహక్కును కల్పించారని రిటైర్డ్ జడ్జి టి రజని చెప్పారు. ఇది ప్రపంచ దేశాలకు ఆదర్శంగా ఉందన్నారు. భారత్‌లో పోరాటం ద్వారా సాధించుకున్న మహిళల హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. అనిబీసెంట్, సరోజినీనాయుడు మహిళల ఓటు హక్కు కోసం ఉద్యమించినవారిలో ఉన్నారని చెప్పారు. దశలవారీగా మహిళల ఓటింగ్ శాతం పెరుగుతూ వచ్చిందనీ, ఆతర్వాత పోటీచేయడానికి అవకాశం దక్కిందని వివరించారు. రాజకీయ స్వేచ్ఛకోసం మహిళలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. 1951-52లో పూర్తిస్థాయిలో మహిళలతోపాటు వయోజనులందరికీ ఓటు హక్కు సాధించుకున్నారని చెప్పారు. రాజ్యాధికారానికి మహిళలు అర్హులయ్యారని చెప్పారు. విజ్ఞతతో ఓటు వేసే అవకాశం లేకుండా పోయిందనీ, కులం, ప్రాంతం, మతం, డబ్బు, రాజకీయాలు, ఆర్థికాంశాలు ఓటును దెబ్బతీస్తున్నాయన్నారు. తద్వారా మహిళ అధికారం వీగిపోతున్నదని అభిప్రాయపడ్డారు. అన్నం, బట్ట, పుస్తకం అన్నీ రాజకీయమే అవుతున్నాయని గుర్తు చేశారు. ఓటుతో మహిళలకు సంబంధించి అన్ని విషయాలు లింక్ అయి ఉన్నాయని చెప్పారు. ఓటును సద్వినియోగం చేయడం ముఖ్యమని వ్యాఖ్యానించారు.

విద్యార్థి దశనుంచే పోరాటాలు : సుధా సుందరరామన్

సుశీలగోపాలన్ విద్యార్థి దశ నుంచే చురుగ్గా ఉన్నారని సుశీలగోపాలన్ స్మారక ట్రస్ట్ కార్యదర్శి సుధా సుందరరామన్ అన్నారు. దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, హింసలో మహిళలతోపాటు పిల్లలు ఎక్కువగా బాధితులు అవుతున్నారని చెప్పారు. 1981లో సుశీల ఐద్వా జాతీయ సంఘంగా తీర్చిదిద్దారనీ, తనే మొదటి ప్రధానకార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. వర్కింగ్ క్లాస్ కోసం తీవ్రంగా శ్రమించినట్టు వివరించారు. ట్రేడ్ యూనియన్ కార్మిక సమస్యలపై ఉద్యమించారని చెప్పారు. శ్రామిక మహిళలు, అసంఘటిత రంగంలో పనిచేశారని అన్నారు. న్యాయపరమైన హక్కులు, పరిపాలన విషయాల్లో ఎక్కువ కృషి చేశారని చెప్పారు. మూడుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వర్తించారని అన్నారు. కేరళలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన చరిత్ర సుశీలగోపాలన్‌దని గుర్తు చేశారు. వరకట్న సమస్యలపై ఐద్వా పనిచేసే అవగాహన కల్పించే ప్రయత్నం చేశారని వివరించారు. సుశీలా సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు.

ఐద్వా ఉద్యమంలో చెరగని ముద్ర సుశీలగోపాలన్ : పుణ్యవతి

సుశీలగోపాలన్ స్మారక ట్రస్ట్ ట్రస్టీ ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ సుశీలగోపాలన్ స్మారక ఉపన్యాసాలు దేశవ్యాప్తంగా ఆయా నగరాల్లో జరుగుతున్నాయని అన్నారు. ఐద్వా జాతీయ మహాసభలు జనవరిలో ఉన్న కారణంగా ఈసారి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. భువనేశ్వర్, కేరళ, బెంగళూరు తదితర ప్రాంతాల్లో చేపట్టినట్టు వివరించారు. సుశీలగోపాలన్ ఉద్యమ బాధ్యతే కుటుంబ బాధ్యతగా భావించారని గుర్తు చేశారు. కేరళలో కొబ్బరి పీచు కార్మికులను చైతన్యం చేయడంలో సుశీలగోపాల్ పాత్ర కీలకమని వ్యాఖ్యానించారు. పార్లమెంటులో మహిళా హక్కుల కోసం పోరాటం చేశారని చెప్పారు. ఐక్య ఉద్యమాలను నిర్మించడంలో దిట్ట అని అభిప్రాయపడ్డారు.

వందన సమర్పణ చేసిన ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ సర్‌తో కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధిని పొందే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నేత టి జ్యోతి, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి ఆఫీస్ బేరర్లు కెఎన్.ఆశాలత, బుగ్గవీటి సరళ, నాగలక్ష్మి, వినోద, వరలక్ష్మి నాయకులు లక్ష్మమ్మ, పద్మ , సృజన పాల్గొన్నారు.

భారత విద్యార్థులకు బ్రిటిష్ కౌన్సిల్ గ్రేట్ స్కాలర్‌షిప్స్

ప్రజాశక్తి - హైదరాబాద్

కల్చరల్ సంబంధాలు, విద్యా అవకాశాల కోసం యుకెలోని అంతర్జాతీయ సంస్థ బ్రిటిష్ కౌన్సిల్, యుకె గవర్నమెంట్ గ్రేట్ బ్రిటన్ క్యాంపెయిన్ పార్టనర్‌షిప్ తో గ్రేట్ స్కాలర్ షిప్‌లు 2026-27 ను ప్రకటించింది. యుకెలో పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ కొనసాగించడానికి అకాడమిక్ విద్యలో నిరూపితమైన మంచి రికార్డు ఉన్న కష్టపడే భారతీయ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను ఇవ్వనున్నట్లు వెల్లడించింది. 2026-27 విద్యా సంవత్సరానికి, ప్రముఖ యుకె యూనివర్సిటీలు వివిధ రకాల సబ్జెక్టులలో 12 పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్ షిప్‌లను అందిస్తున్నాయి. ప్రతి స్కాలర్ షిప్ ఒక సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు కోసం ట్యూషన్ ఫీజు కోసం కనీసం 10,000 పౌండ్లు అందించనున్నట్లు బ్రిటిష్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఇండియా డైరెక్టర్ రితికా చందా పారక్ తెలిపారు.



పెన్‌పహాడ్ ఫొటోగ్రాఫర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

- లంబాడి జీవనశైలి, సంప్రదాయాలపై ఫొటోలు

హైదరాబాద్ బ్యూరో : లంబాడి జీవన శైలి, సంప్రదాయం ఉట్టిపడేలా ఫోటోలు తీసిన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని చెట్ల ముకుందాపురం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ వాస శ్రీనివాసుకు జాతీయ స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు వరించింది. ప్రముఖ ఫ్యాకల్టీ హుస్సేన్ ఖాన్ (ఎఎఫ్ఐఎపి) ఆధ్వర్యంలో 8వ జాతీయస్థాయి ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వాణలో భాగంగా ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలం రాళ్లబండ గ్రామంలో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఫొటోగ్రాఫర్లు లంబాడి సంస్కృతీ సంప్రదాయాల గురించి ఫొటో వర్క్‌షాప్ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలో లంబాడి జీవనశైలి సంప్రదాయాలపై శ్రీనివాస్ తీసిన ఫొటో ఎంపికైంది. శ్రీనివాస్‌కు ఎఫ్ఆర్‌పిఎస్ టి శ్రీనివాస్‌రెడ్డి అవార్డు అందజేశారు. శుక్రవారం గ్రామస్తులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

నగరంలో హైడ్.ఆర్ట్ 2025 ప్రారంభం



హైదరాబాద్ : కుంచె విదిల్చిన కాంతి రేఖలు, చేతిలో ప్రాణం పోసుకున్న అద్భుత కళాఖండాలు సృజనాత్మకతకు వేదికగా 'హైడ్.ఆర్ట్ 2025' నిలిచింది. ఈ మహాసాంస్కృతిక వేడుకను నానక్‌రామ్‌గూడలో నవనామి ఈయాన్‌లో ఏర్పాటు చేయగా.. దీనికి ముఖ్య అతిథి ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి ఇలాంటి ఒక కార్యక్రమం అవసరమని ఎప్పటి నుంచో భావిస్తున్నానని పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబయి వంటి నగరాల్లో కళా ప్రదర్శనలు విరివిగా జరుగుతున్నాయన్నారు. కళాభిమానులు వాటిని ప్రోత్సహిస్తూ సంబరంగా జరుపుకుంటున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో మాత్రం ఇలాంటి కళా సంస్కృతి లేకపోవడం లోటుగా అనిపించిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్‌సిటీ అండ్ విద్యాపీఠ్ వైస్ ఛైర్మన్ ప్రీతి రెడ్డి, హైడ్.ఆర్ట్ క్యూరేటర్, షో డైరెక్టర్ అన్నపూర్ణ మడిపడిగ, హైడ్.ఆర్ట్ వ్యవస్థాపకుడు హసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిపై విపక్షం దుష్ప్రచారం..

- 74 శాతం ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి
- ఇది మా ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం
- రెండేళ్లు పూర్తి చేసుకున్న ప్రజావాణి
- డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణిపై విపక్షం తప్పుడు ప్రచారం చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. అది తప్పని తేలిందని ఆయన అన్నారు. ప్రజావాణిలో లక్షకు పైగా పిర్యాదులు వస్తే..వాటిలో 74శాతం పిర్యాదులను పరిష్కరించామని ఆయన తెలిపారు. ప్రజావాణి ప్రారంభమై రెండేండ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి అధికారి దివ్యదేవరాజన్ అధ్యక్షతన జరిగిన మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాసమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని భట్టి ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆక్షేపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన విపక్షం ఎన్ని విమర్శలు చేసినా.. తాము మరింత ముందుకు వెళ్తామని చెప్పారు. పోరాడి తెచ్చుకున్న రాష్ట్రంలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజావాణి విజయవంతం చేసిన చిన్నారెడ్డికి దివ్యాదేవరాజన్‌కు భట్టి అభినందనలు తెలిపారు.

ఉన్నతాధికారులకు సన్మానం

సిఎం ప్రజా వాణి కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి.పి.గౌతంను సత్కరించటంతో పాటు హౌసింగ్ కార్పొరేషన్ విజిలెన్స్ ఆఫీసర్ బలరాం, వర్క్ ఇన్ స్పెక్టర్ ఎస్. సత్తిరెడ్డి తదితరులను కూడా ప్రశంసా పత్రాలతో అభినందించారు. ఫిర్యాదుల పై చర్యలు తీసుకోవటంలో చొరవ చూపటంతో పాటు, ప్రజా సమస్యలను పరిష్కరించి మేలు చేసిన విభాగాల్లో హౌసింగ్ మొదటి స్థానంలో నిలిచింది. గత రెండేండ్ల కాలంలో ప్రజా వాణి ద్వారా 19,456 పిటిషన్లు, ఫిర్యాదులు, సమస్యలు రాగా వాటిలో 19,265 పిటిషన్లపై చర్యలు తీసుకున్నారు. ఇంకా 162 ఫిర్యాదులు మాత్రమే వివిధ దశల్లో పెండింగ్ లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రజావాణి ద్వారా సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న 1,750 మంది డబుల్ బెడ్ రూం లబ్ధిదారుల సమస్య పరిష్కారమై, ఇండ్లు కేటాయించటం పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

రెండేళ్లలోనే తెలంగాణకు కొత్త దిశ

- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం
- సమాచార శాఖ మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం తెలంగాణకు స్పష్టమైన కొత్త దిశను చూపించిందని రాష్ట్ర సమాచార, హౌసింగ్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు ఏ మార్పుకోసమైతే కాంగ్రెస్‌పై విశ్వాసం ఉంచారో, ఆ మార్పు రెండేళ్ల కాలంలోనే ప్రజల కండ్ల ముందు కనిపిస్తున్నదన్నారు. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందని చెప్పారు. తెలంగాణ సమాచార పౌర సంబంధాలశాఖ, మీడియా అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా ప్రజా సంబంధాల అధికారులతో శుక్రవారం నిర్వహించిన పునశ్చరణ తరగతులకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మేం అధికారం చేపట్టినప్పుడు అన్నీ రంగాల్లో తీవ్ర సంక్షోభం నెలకొందన్నారు. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆ సంక్షోంభం నుంచి బయటపడి, అభివృద్ధి, సంక్షేమాలను పరుగులు పెట్టిస్తున్నాయని అన్నారు. సిఎం ఆలోచనలకు అనుగుణంగా అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తూ పేదలకు అండగా నిలిచామని చెప్పారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహనిర్మాణం, సన్న బియ్యం పంపిణీ, రేషన్‌కార్డులు, ఉపాధి కల్పన వంటి ప్రతి రంగంలోనూ ప్రజాప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెడుతున్నాయని అన్నారు. అయితే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో ప్రజలకు చేరడం లేదని వివరించారు. ప్రస్తుత మీడియా మార్పులకు అనుగుణంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు డిజిటల్ మీడియా సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వేగంగా విస్తరిస్తున్న సోషల్‌మీడియాను సైతం ప్రచారానికి శక్తివంతమైన ఆయుధంగా వినియోగించుకోవా లని సూచించారు. క్షేత్రస్థాయిలో ఈ పని ఎక్కువగా జరగాలని చెప్పారు. ప్రతి జిల్లాకు సమర్థవంతమైన డీపీఆర్‌వోలను నియమించాలనీ, ఇతర విభాగాల్లో ఉన్నవారి డిప్యూటేషన్లను రద్దుచేయాలని ఆదేశించారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలనీ, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా రెండేండ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ మాస పత్రికను మంత్రి, ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి, ఐడిసి చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, సిఎం సిపిఆర్‌ఒ జి మల్సూర్ పాల్గొన్నారు.

విజి జీ రామ్‌జీ బిల్లుల దహనం

- ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్రం ప్రయత్నం
- చట్టం రద్దును నిరసిస్తూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ దాని స్థానంలో వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (వీబీ జీ రామ్ జీ) బిల్లును తీసుకొచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం.. పార్లమెంట్‌లో ఏకపక్షంగా ఆమోదించుకుంది. దీన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పలు జిల్లాల్లో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బిల్లు ప్రతులను దహనం చేశారు. గద్వాల జిల్లా కేంద్రంలోని అలంపూర్ చౌరస్తాలో బిల్లు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాం నాయక్ మాట్లాడుతూ.. ప్రజల ఉపాధికి తూట్లు పొడవడమే దేశభక్తా అని బిజెపిని ప్రశ్నించారు. వామపక్షాల పోరాటంతో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన విబి జీ రామ్ జీ 2025 పథకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడలో నిరసన తెలిపారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలియజేశారు. అమరచింత మండలం పామిరెడ్డిపల్లిలో బిల్లు ప్రతులను దహనం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్ మండలంలోని ఎర్రవల్లి, జైదుపల్లి గ్రామాల్లో బిల్లు పత్రులను దహనం చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఎన్‌టిపిసి మేడిపల్లి సెంటర్‌లో బిల్లు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ములుగు జిల్లా పస్రాలో, వెంకటాపురంలోని తళ్లపహాడ్ సెంటర్‌లో బిల్లు ప్రతులు దహనం చేశారు. మహబూబాబాద్, బయ్యారంలో ప్రతులు దహనం చేసి నిరసన తెలిపారు. ఆత్మకూరు మండలం మూలమల్లలో బిల్లు ప్రతులు దహనం చేసి గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డిలో బిల్లు ప్రతులు దహనం చేసి నిరసన తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం పాండవుల బస్తీలో జీ రామ్ జీ జిఒ ప్రతులను దహనం చేశారు.

బాల్యవివాహం కేసులో తండ్రికి జీవిత ఖైదు

- పెళ్లి చేసుకున్న వ్యక్తికి జీవితాంతం జైలు శిక్ష
- బాధితురాలికి రూ.15 లక్షల పరిహారం అందజేయాలని రంగారెడ్డి జిల్లా కోర్టు ఆదేశం

హైదరాబాద్ బ్యూరో : బలవంతంగా బాలికకు వివాహం చేసిన తండ్రికి జీవిత ఖైదు, పెండ్లి చేసుకున్న వ్యక్తికి జీవితాంతం జైలు శిక్షతోపాటు ఇద్దరికీ రూ.75,000 చొప్పున జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పాస్ట్‌ట్రాక్ కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... 2018లో సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే సూర్యాపేట జిల్లా తిప్పర్తి మండలం, చిన్న సూరారం గ్రామానికి చెందిన తునం జానయ్య తన కూతురుకు బలవంతంగా ఆత్మకూరు మండలం గట్టిగల్లు గ్రామానికి చెందిన సుంకరి అనిల్ కుమార్ అలియాస్ అనిల్‌తో వివాహం చేశారు. బాలిక ఆరు నెలల గర్భవతి కావడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పూర్తి ఆధారాలు పరిశీలించిన పాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి పద్మావతి.. పెండ్లి చేసుకున్న వ్యక్తికి, బాలిక తండ్రికి శిక్షలు విధించారు. బాధితురాలికి రూ.15 లక్షల పరిహారం అందించాలని ఆదేశించారు.

బైరమ్ గాడ్ అడవుల్లో ఎదురుకాల్పులు : మావోయిస్టు మృతి

హైదరాబాద్ బ్యూరో : సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బైరమ్‌గాడ్ అడవుల్లో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. బీజాపూర్ జిల్లా ఎస్‌పి జితేంద్ర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీజాపూర్ జిల్లా బైరామ్‌గాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి ప్రాంతం అడ్వాడ-కోట్‌మెటా అడవుల్లో మావోయిస్టుల ఉనికి ఉందన్న సమాచారం ఆధారంగా బీజాపూర్ డీఆర్‌జీ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ సెర్చ్ ఆపరేషన్ సమయంలో మావోయిస్టులు ఎదురుపడటంతో కాల్పులు జరిగాయి. ఈ క్రమంలో ఒక మావోయిస్టు మృతిచెందినట్టు ఎస్పీ తెలిపారు. ఘటనాస్థలం నుంచి మావోయిస్టు మృతదేహంతో పాటు ఒక 303 రైఫిల్, ఒక 9 పిస్టల్, పేలుడు పదార్థాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కాగా, మృతిచెందిన మావోయిస్టు ఏరియా కమాండర్ మెంబర్ ఫగ్ను మద్వీగా గుర్తించారు. ఇతనిపై రూ.5లక్షల రివార్డు ఉన్నట్టు ఎస్పీ తెలిపారు.

'ఉపాధి' రక్షణ కోసం 22న గాంధీ విగ్రహం వద్ద నిరసన

- 23న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- నరేగా నిధుల్లో కేంద్రం వాటా తగ్గించడం సరిగాదు
- ఉపాధి చట్టాన్ని నిర్వీర్యాన్ని చేయడాన్ని ఖండించండి
- వామపక్ష పార్టీల నేతల పిలుపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుపిఎ ప్రభుత్వ హయాంలో కొట్లాడి సాధించుకున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు గ్రామీణ ప్రజలంతా పోరాటాల్లోకి రావాలనీ, ఈ నెల 22 సికింద్రాబాద్‌లో ప్యాట్నీలోని గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. 23న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష పార్టీల నేతలు సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ...ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చి కేంద్రం తన వాటాను 90 నుంచి 60 శాతానికి తగ్గించుకోవడం, రాష్ట్రాల వాటాను 10 నుంచి 40 శాతానికి పెంచడం నిర్వీర్యం చేయడంలో భాగమేనని విమర్శించారు. ఉపాధి పనిముట్లు ఇచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని ముసాయిదా బిల్లులో పేర్కొనడం దుర్మార్గమన్నారు. పట్టణ ప్రాంతాలకు 'ఉపాధి'ని విస్తరించాలనే డిమాండ్ ను పట్టించుకోకుండా ఉన్న కూలీల సంఖ్యను తగ్గించి కుదించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న ఆ చట్టాన్ని వీబీ జీ రామ్‌జీ గా మార్చడాన్ని తప్పుబట్టారు. ఇలా చేయడం గాంధీని అవమానించడమేనన్నారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేస్తామని ప్రకటించారు. ఉపాధి పనిదినాలను 200 రోజులకు పెంచాలనీ, రోజువారీ కూలి రూ.600 ఇవ్వాలనీ, కేంద్ర బడ్జెట్‌లో 2.5 లక్షల కోట్ల రూపాయలను కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నర్సింహ మాట్లాడుతూ... రాముడి సెంటిమెంట్‌తో, మతం మత్తుతో ప్రజలను మభ్యపెడుతూ దేశ సంపదను మోడీ సర్కారు కార్పొరేట్లకు కట్టబెడుతున్నదని విమర్శించారు. ఓ పక్కన ఇందిరాగాంధీ, నెహ్రూ, గాంధీ మీద రాజకీయ దాడి చేస్తూనే మరోవైపు దేశంలో కమ్యూనిస్టులు లేకుండా చేయాలని బీజేపీ చూస్తోందన్నారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం అన్ని పార్టీలతో కలిసి ముందుకు సాగుతామన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవర్ధన్ మాట్లాడుతూ... మోడీ సర్కారు భావజాల రంగంలో వేగంగా తీసుకొస్తున్న మార్పుల గురించి వివరించారు. అదే సమయంలో కార్పొరేట్ల లాభాలకు అటంకంగా ఉన్న వ్యవసాయ, కార్మిక చట్టాలను మారుస్తూ పోతున్నదని విమర్శించారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హన్మేష్ మాట్లాడుతూ..జాయింట్ పార్లమెంటరీ, స్టాండింగ్ కమిటీలో కనీసం చర్చ పెట్టకుండా ఏకపక్షంగా బిల్లును పార్లమెంట్‌లో ఎలా ప్రవేశపెడ్తారని ప్రశ్నించారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ..ప్రజల ముందు రాష్ట్ర ప్రభుత్వాలను బదనాం చేసి తాను బలపడేందుకు మోడీ సర్కారు చట్టాల్లో మార్పులు చేసుకుంటూ పోతున్నదన్నారు. కార్పొరేట్ల ఆస్తులను రెట్టింపు చేసేందుకు జైశ్రీరాం పేరును వాడుకుంటున్నదని విమర్శించారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేత ఆర్.వీ. ప్రసాదర్ మాట్లాడుతూ..పథకానికి రాముడి పేరు అర్థం వచ్చేలా పెట్టి పేదల పొట్టగొట్టేలా నిర్ణయాలు తీసుకోవడం దుర్మార్గమని విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్రను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, అబ్బాస్, సీనియర్ నేత డీజీ నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బాల్కనీ నుంచి పడి యువతి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రియుడితో కలిసి తన ఇంటికి వెళ్ళిన ఓ యువతి.. అదే సమయానికి ఆమె తండ్రి రావడంతో.. తప్పించుకునే క్రమంలో ప్రమాదవశాత్తు బాల్కనీ నుంచి కిందపడి యువతి మృతి చెందిన విషాదకర ఘటన సంగారెడ్డి జిల్లా కొల్లూర్‌లో జరిగింది. సిఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరులోని కెసిఆర్ నగర్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయంలో 8 అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో యువతి ఫాతిమా (20) తన కుటుంబంతో కలిసి నివసిస్తోంది. యువతి ఓ ప్రయివేటు సంస్థలో పనిచేస్తుంది. కాగా గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ప్రియుడు హుస్సేన్ ఆలీతో కలిసి ఇంటికి వచ్చింది. అతనితో గదిలో ఉన్న సమయంలో యువతి తండ్రి వచ్చి తలుపు తట్టాడు. తండ్రికి దొరికిపోతానన్న భయంతో హుస్సేన్ అలీ సాయంతో బాల్కనీ నుంచి వేరే ఫ్లాట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడి మృతి చెందింది. సమాచారం అందుకున్న కొల్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రియుడు హుస్సేన్ అలీని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు చెప్పారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

ఎస్‌పిఇ యాక్ట్‌ను పునరుద్ధరించాలి

- లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి..
- రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలి : భానుకిరణ్
- లేబర్ కమిషనరేట్ ముందు ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతోపాటు సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ (ఎస్‌పిఇ) యాక్ట్‌ను పునరుద్ధరించాలని, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ (టిఎంఎస్‌ఆర్‌యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ భాను కిరణ్ అన్నారు. లేబర్ కోడ్స్ రద్దు, ఎస్‌పిఇ యాక్ట్ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటీవ్స్ యూనియన్ హైదరాబాద్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ రాజుభట్ అధ్యక్షతన చిక్కడపల్లిలోని కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భానుకిరణ్ మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌పిఇ యాక్ట్‌ను పునరుద్ధరించే వరకు టిఎంఎస్‌ఆర్‌యు సభ్యులందరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ హక్కుల పరిరక్షణకు భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి ఏ.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎస్‌పిఇ యాక్ట్‌ను పోరాడి సాధించుకుంటామని, భవిష్యత్‌లో జరిగే పోరాటాల్లో టిఎంఎస్ సర్వీస్ సభ్యులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.రమేష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫార్మా కంపెనీలు మెడికల్ రిప్రజెంటేటివ్స్‌పై అధిక పని భారం మోపుతూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పని గంటలు, టార్గెట్లు, ఉద్యోగ భద్రత, వేతనాలు వంటి అంశాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితులకు ముగింపు పలకాలంటే ఎస్‌పీఈ యాక్ట్‌ను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ధర్నాలో యూనియన్ కోశాధికారి దుర్గాప్రసాదరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏఎన్.చారి, జగదీశ్వర చారి, లోకేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ కార్యదర్శి రాజ్ కుమార్, కూకట్‌పల్లి కార్యదర్శి జి.కిషోర్, సికింద్రాబాద్ కార్యదర్శి టివి.సతీష్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఐఎఫ్‌టీయూ నాయకులు పద్మ, విజయ్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న భానుకిరణ్



అవగాహనే క్యాన్సర్ వ్యాధికి అసలైన వ్యాక్సిన్

- 850 విద్యాసంస్థల్లో 2.8 లక్షల మంది యువత క్యాన్సర్ నివారణ ప్రతిజ్ఞ
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్యాన్సర్‌పై అవగాహన కల్పించడమే అసలైన నివారణ మార్గమని చాటిచెప్పేలా తెలంగాణా వ్యాప్తంగా 850కి పైగా విద్యాసంస్థల్లో 2.8 లక్షల మంది యువత క్యాన్సర్ నివారణ ప్రతిజ్ఞ తీసుకున్నారు. ఈ అరుదైన కార్యక్రమం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అధికారికంగా నమోదైంది. హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలోని క్యాన్సర్ నివారణ కేంద్రం, తెలంగాణ ప్రభుత్వ సంస్థ తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంయుక్తంగా శుక్రవారం ఈ భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు, యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకుని, ఇతరులకు కూడా అవగాహన కల్పించడం ద్వారా ఈ మహమ్మారి వ్యాప్తిని అడ్డుకునేందుకు తాము కృషి చేస్తామని ప్రతిజ్ఞలో పాల్గొన్న యువత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని టాస్క్ సిఇఒ శ్రీకాంత్ సిన్హా ఉపన్యాసంతో ప్రారంభించారు. కార్యక్రమ లక్ష్యాలను వివరిస్తూ ప్రతిజ్ఞకు ముందుకొచ్చిన వారందరికీ ఆయన స్వాగతం పలికారు. క్యాన్సర్ తీవ్రత, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను డా.నిషా హరిహరన్ (సర్జికల్ ఆంకాలజిస్టు) ఉదాహరణలతో వివరించారు. ఆ తర్వాత ఆస్పత్రి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి సిఇఒ డా కె కృష్ణయ్య 2.8 లక్షల మందితో ఒకేసారి క్యాన్సర్ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు పాల్గొన్న వారి సంఖ్యను నిర్ధారించిన అనంతరం, జాయింట్ సెక్రటరీ డా ఉల్లాజి ఎలియజార్ రికార్డు నమోదు చేస్తూ ప్రత్యేక మెమెంటోను టాస్క్, బసవతారకం సంస్థ బృందాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక మంచి ఉద్దేశంతో ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడం తొలిసారి కావడం అభినందనీయమన్నారు.

ట్రస్ట్ బోర్డు సభ్యులు జెఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ.. క్యాన్సర్ నివారణపై ఆస్పత్రి నిరంతరం దృష్టి సారించి ప్రజల్లో అవగాహన కల్పిస్తోందన్నారు. నివారణ చర్యలను చిన్నచూపు చూడకూడదని, వ్యాధి వచ్చిన తర్వాత బాధపడే కన్నా ముందే నివారించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. డా. కె.కృష్ణయ్య మాట్లాడుతూ.. 25 ఏండ్లుగా క్యాన్సర్ నివారణ అవగాహన కోసం ఆస్పత్రి కృషి చేస్తోందని, త్వరితగతిన వ్యాధి గుర్తింపునకు ప్రత్యేక నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వెన్నుపోటు రాజకీయాల వల్లే పార్టీకి నష్టం

- ఎఐసిసి, క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేస్తా : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాల వల్లే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కార్యకర్తలకు నష్టం వాటిల్లిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆరోపణలు చేశారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నంది హిల్స్‌లోని తన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలోని 140 గ్రామ పంచాయతీల్లో ఇటీవల జరిగిన ఎన్నికలలో రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలు తమ సంతృప్తిని ఓటురూపకంగా తెలిపారన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు తమ మద్దతు తెలిపిన ఓటర్లకు, ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. వనపర్తి నియోజకవర్గంలో 51 శాతం బిసిలను బరిలో దించామని తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీకి వచ్చిన 51 గ్రామ పంచాయతీ స్థానాలలో 15-20 స్థానాలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందే అవకాశం ఉన్నా తమ పార్టీ సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాల కారణంగా కార్యకర్తలకు నష్టం జరిగిందని ఆరోపించారు. ఈ విషయమై ఎఐసిసి క్రమశిక్షణ కమిటీ, హైకమాండ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేగా తనపై నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి కోపం ఉంటే ప్రత్యక్షంగా చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా జెండా మోసిన కార్యకర్తలను టార్గెట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. సీనియర్ నాయకులమని చెప్పుకుంటూ పార్టీకి ద్రోహం చేసేవాళ్ల తీరును కాంగ్రెస్ పార్టీ మేధావులు, ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, పిసిసి సభ్యులు శంకర్ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మెన్, వైస్ చైర్మెన్, నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇల్లు తనఖా పెట్టి.. పేద విద్యార్థినికి విద్యారుణం

- మరోసారి మానవత్వం చాటుకున్న హరీశ్‌రావు
- సిద్దిపేటలోని బస్తీ దవాఖానను అకస్మిక సందర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి తన మానవతా ఔదార్యాన్ని చాటిచెప్పారు. ఆపదలో ఉన్నామంటే ఆగమేఘాల మీద స్పందించే ఆయన.. తాజాగా ఓ నిరుపేద వైద్యవిద్యార్థిని భవిష్యత్తుకు చేయూత అందించారు. ఆ విద్యార్థినికి బ్యాంకు రుణం దక్కడానికి ఏకంగా తన సొంత ఇంటినే తనఖా పెట్టి పెద్దమనసు చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేటకు చెందిన కొంక రామచంద్రం టైలరింగ్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన పెద్ద కుమార్తె మమత విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఉచితంగా ఎంబిబిఎస్ సీటు సాధించి చదువు పూర్తి చేసింది. పిజి ఎంట్రన్స్ పరీక్ష రాయగా మహబూబ్‌నగర్‌లోని ఎస్‌విఎస్ మెడికల్ కళాశాలలో అప్తమాలజీ విభాగంలో సీటు వచ్చింది. ప్రభుత్వ కన్వీనర్ కోటాలోనే సీటు వచ్చినప్పటికీ మూడేళ్ల పాటు ప్రతి ఏడాది రూ.7.50 లక్షల చొప్పున ట్యూషన్ ఫీజు చెల్లించాలి. అందుకు ఈ నెల 18వ తేదీ చివరి గడువుగా ఉంది. ఆర్థిక స్తోమత లేని రామచంద్రం అంత డబ్బు చెల్లించలేక మనోవేదనకు గురయ్యాడు. బ్యాంకులో ఎడ్యుకేషన్ లోన్ కోసం ప్రయత్నించగా ఏవైనా ఆస్తులు మార్టిగేజ్ చేస్తేనే లోన్ ఇస్తామని బ్యాంకు అధికారులు సమాధానం ఇచ్చారు. తనకు ఎలాంటి స్థిరాస్తులు లేవని చెప్పడంతో ఆ దారి కూడా మూసుకుపోయింది. దాంతో గతంలో తన కూతుళ్లకు ఎంబిబిఎస్ సీట్లు వచ్చినప్పుడు హరీశ్‌రావు ఆర్థికసాయం చేసిన విషయం గుర్తుకొచ్చి.. మళ్లీ ఆయనే ఆదుకుంటారని భావించి ఈ విషయాన్ని చేరవేశారు. వెంటనే స్పందించిన హరీశ్‌రావు.. సిద్దిపేటలోని తన ఇంటిని మార్టిగేజ్ చేసి మూడేండ్లకు సరిపడా దాదాపు రూ. 20 లక్షలు ఎడ్యుకేషన్ లోన్ మంజూరు చేయించారు. దాంతో ఆ డబ్బులను కళాశాలలో చెల్లించి సీటు దక్కించుకున్నారు. కాగా, మొదటి సంవత్సరం హాస్టల్‌కు లక్ష రూపాయలు అవుతుందని తెలుసుకున్న హరీశ్‌రావు.. మళ్లీ హాస్టల్ ఫీజుకు ఎలాంటి అప్పు చేయొద్దని.. ఆ లక్ష రూపాయలు కూడా తానే చెల్లిస్తానని భరోసా ఇచ్చారు. కాగా, ఆటో కార్మికుల సంక్షేమానికి మూడేండ్ల క్రితం తన ఇంటిని మార్టిగేజ్ చేసి బ్యాంకు ద్వారా రుణం ఇప్పించారు. ఆ ఫలితంగానే 'సిద్దిపేట ఆటో క్రెడిట్ కో - ఆపరేటివ్ సొసైటీ' ఏర్పాటు చేశారు. దీనిద్వారా కార్మికులకు రుణాలు ఇస్తూ కొండంత భరోసాగా నిలిచింది.

బస్తీ దవాఖానాల్లో ఆరు నెలలుగా డాక్టర్లు లేరు : హరీశ్‌రావు

గత ప్రభుత్వంలో సిద్దిపేటలో నాలుగు చోట్ల బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసుకున్నామని, ఒక్క కేసీఆర్‌నగర్‌లోని బస్తీ దవాఖానలో మినహాయించి మిగతా మూడు దవాఖానల్లో ఆరు నెలల నుంచి డాక్టర్లు లేరని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ వద్దనున్న బస్తీ దవాఖానను శుక్రవారం హరీశ్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళ్లకుంట కాలనీ, లింగారెడ్డి పల్లి, ఆర్‌అండ్‌బి కార్యాలయం సమీపంలోని దవాఖానల్లో డాక్టర్లు లేరని, డాక్టర్లు లేకుండా ప్రజలకు వైద్యం ఎలా అందిస్తారని ప్రశ్నించారు. అటెండర్‌కు మూడు నెలలుగా జీతం రావడం లేదని, స్టాఫ్ నర్స్‌కూ నవంబర్ నెల జీతం ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. వెంటనే దవాఖానల్లో వైద్యులను నియమించి, మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

రామ్ వంజీ సుతార్ మరణం పట్ల కెసిఆర్ సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి గర్వంగా నిలబెట్టిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ రూపశిల్పి, పద్మ భూషణ్ రామ్ వంజీ సుతార్ మరణం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కె చంద్ర శేఖర్‌రావు (కేసీఆర్) సంతాపం ప్రకటించారు. ప్రముఖుల విగ్రహాలకు రూపం పోసి, ప్రపంచ స్థాయి ప్రతిభను కనబరిచి, శిల్పకళా రంగంలో కోహినూర్ వజ్రంగా పోల్చదగిన ఆయన సేవలను అంబేద్కర్ రూపంలో తెలంగాణ వినియోగించుకోవడం గర్వ కారణమని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్మాణంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే విధంగా అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తులో, అత్యంత సుందరంగా మనోహరంగా తీర్చిదిద్దిన, రామ్ వంజీ సుతార్ ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటారని పేర్కొన్నారు. ఆయన మరణం శిల్పకళా రంగానికి తీరని లోటని కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- చర్లపల్లి సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో కలకలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకుల కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం నల్లగొండ జిల్లాపరిధిలోని చర్లపల్లి సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలం గోగిగూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని శివాని చర్లపల్లిలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. మధ్యాహ్న సమయంలో కళాశాలలోని మూడో అంతస్తు నుంచి కిందకు దూకింది. గమనించిన తోటి విద్యార్థినులు, అధ్యాపకులు వెంటనే పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. జీవితంపై విరక్తితో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు శివాని సూసైడ్ లెటర్ రాసిందని రూరల్ ఎస్ఐ సైదాబాబు తెలిపారు. విద్యార్థిని తల, మెడ ప్రాంతంలో తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.

గాంధీ పేరు తొలగింపు ఆక్షేపణీయం

- కేంద్రంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ఉపాధి హామీ చట్టం నుంచి మహాత్మాగాంధీ పేరు తొలగించి వికసిత్ భారత్ జీ రామ్ జీగా మార్చడం ఆక్షేపణీయమని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ కొత్త బిల్లు కేవలం ఒక పేరు మార్పు మాత్రమే కాదనీ, ఇది దేశ సమాఖ్య వ్యవస్థపై ప్రత్యక్ష దాడి అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై శుక్రవారం స్పందించారు. ఈ చట్టంలో 60:40 నిధుల నిష్పత్తిని తెరపైకి తెచ్చి కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఉపాధి హామీని బలహీనపరచాలని చూస్తోందని విమర్శించారు. ఈ నిబంధన వల్ల రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. ఇది పేదలకు పని కల్పించే చట్టాన్ని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల అధికారాలను తగ్గిస్తూ కేంద్రం తన పెత్తనాన్ని పెంచుకోవడానికి ఈ బిల్లును ఒక ఆయుధంగా వాడుకుంటోందని, ఇది రాజ్యాంగం కల్పించిన రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కాలరాయడమేనని తెలిపారు. ఈ విషయంలో కాంగ్రెస్ మౌనాన్ని ఆయన తప్పుబట్టారు. 60:40 నిష్పత్తి వల్ల రాష్ట్రాలకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించకుండా కాంగ్రెస్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న కపటత్వాన్ని ఆయన ప్రశ్నించారు. బయట సమాఖ్య వ్యవస్థ గురించి, రాష్ట్రాల హక్కుల గురించి మాట్లాడే కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ లోపల మాత్రం రాష్ట్రాలను బలహీనపరిచే బీజేపీ చర్యలకు లోపాయికారిగా మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. అధికార కేంద్రీకరణ విషయంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకే నాణేనికి రెండు ముఖాలు అని ఈ బిల్లు ద్వారా మరోసారి స్పష్టమైందని తెలిపారు. నిరుపేదలకు పని కల్పించే ఈ చట్టాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ దీన్ని సంస్కరణగా చిత్రీకరించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం దేశాభివృద్ధికి విఘాతమని స్పష్టం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని దాని మౌలిక స్వరూపం దెబ్బతినకుండా కాపాడాలనీ, గాంధీ పేరును యథావిధిగా కొనసాగిస్తూ రాష్ట్రాల హక్కులను గౌరవించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సైబర్ నేరగాళ్ల కుట్ర విఫలం

- రూ.18 లక్షలు బదిలీ కాకుండా చేసిన సైబర్ క్రైమ్ పోలీస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడిన రిటైర్డ్ టీచర్ డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేసేందుకు సిద్ధపడగా.. విషయం తెలిసిన వెంటనే ఆ నగదు నేరగాళ్లకు బదిలీ కాకుండా సైబర్ క్రైమ్ పోలీసులు కాపాడారు. ఈ ఘటన శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ పుచ్చకాయల దేవేందర్‌రెడ్డికి సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్ చేసి 'బెంగళూరులో అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నావు.. మిమ్మలిని అరెస్ట్ చేస్తాం.. మీరు అరెస్ట్ కాకుండా ఉండాలంటే మేమిచ్చిన అకౌంట్ నెంబర్‌కు వెంటనే రూ.18 లక్షలు డిపాజిట్ చేయాలి' అని భయభ్రాంతులకు గురిచేశారు. దాంతో భయపడి బాధితుడు ప్రకాశం బజార్‌లోని ఎస్‌బీఐ బ్యాంకుకి వెళ్లి రూ.18 లక్షలు డిపాజిట్ చేయాలని మేనేజర్‌ను కోరడంతో.. అనుమానం వచ్చిన మేనేజర్ వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్ఐ విష్ణుకుమార్, సిబ్బంది అక్కడికి చేరుకొని దేవేందర్ రెడ్డిని విచారించగా.. జరిగిన విషయం తెలిపారు. అతనికి వచ్చిన ఫోన్ కాల్ లిస్ట్‌ను పరిశీలించి సైబర్ నేరగాళ్లకు తిరిగి కాల్ చేసి ప్రశ్నించగా తడపడుతూ వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ మాట్లాడుతూ.. డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రభుత్వ సంస్థలు లేదా అధికారులు బెదిరించడం, భయపెట్టడం చేయరు. వీడియో కాల్స్ ద్వారా అరెస్టులు చేయరు.. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అటువంటి కాల్స్ వస్తే వెంటనే www.cyber-crime.gov.inలో లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేసి రిపోర్ట్ చేయాలని సూచించారు. సకాలంలో స్పందించి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా బాధితుడిని కాపాడిన నల్లగొండ సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్ఐ విష్ణు, హెడ్ కానిస్టేబుల్ రియాజ్, కానిస్టేబుల్ మోక్షిద్‌ను జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

దమ్ముంటే వారితో రాజీనామా చేయించు

- సిఎం రేవంత్‌రెడ్డికి కెటిఆర్ సవాల్
- ఫిరాయింపు ఎమ్మెల్యేలు గబ్బిలాల్లా వేలాడుతున్నారు
- సిరిసిల్లలో బిఆర్ఎస్ సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నారని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే.. బిఆర్ఎస్ నుంచి అక్రమంగా చేర్చుకున్న పదిమంది ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సవాల్ విసిరారు. అప్పుడు ప్రజలు ఏవైపు ఉన్నారో నిర్ణయిస్తారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం బిఆర్ఎస్ సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట మార్చడంలో సిద్ధహస్తుడని విమర్శించారు. నిన్న హైదరాబాద్ ప్రెస్‌మీట్‌లో రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ 66 శాతం గెలిచింది.. ఇది ప్రభుత్వంపై ప్రజల ఆశీర్వాదమని గొప్పలు చెప్పారని, మళ్లీ మాట మార్చి.. ఇవి స్థానిక అంశాలపై జరిగిన ఎన్నికలని, ప్రభుత్వానికి సంబంధం లేదని తప్పించుకున్నారని అన్నారు. "ముఖ్యమంత్రి.. మీకు నిజంగానే 66 శాతం ప్రజాదరణ ఉంటే, నా సవాల్ స్వీకరించండి. మా పార్టీ నుంచి మీరు సంతలో పశువుల్లా ఎత్తుకెళ్లిన ఆ పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి. అప్పుడు ప్రజలే చెప్తారు ఎవరి శాతం ఎంతో.. ఎవరి బతుకెంతో.. ఎవరి సత్తా ఎంతో ప్రజాక్షేత్రంలోనే తేలిపోతుంది' అని కెటిఆర్ అన్నారు.

గతంలో మంత్రులుగా, స్పీకర్‌లుగా పనిచేసిన కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి వారు కూడా కేవలం గడ్డిపోచలాంటి పదవుల కోసం ఇంతలా దిగజారి వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. బయట కాంగ్రెస్‌లో చేరామని మైకుల్లో ప్రగల్భాలు పలికి, రాహుల్ గాంధీ కండువా కప్పారని చెప్పుకున్న ఈ పెద్ద మనుషులు.. ఇప్పుడు స్పీకర్ విచారణలో మాత్రం తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. పదవుల కోసం సూరు పట్టుకొని గబ్బిలాల్లా వేలాడుతున్న వీరి బతుకులు పూర్తిగా ఆగమైపోయాయని అన్నారు. ఆటలో అంపైర్‌గా ఉండాల్సిన స్పీకర్ కూడా తాము ఇచ్చిన ఆధారాలు పక్కన పెట్టి ముఖ్యమంత్రి చెప్పినట్టు అబద్ధాలు ఆడక తప్పని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని ఆరోపించారు.

రైతులను, మహిళలను, బిసిలను మోసం చేసినందుకే ఈ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టారని కెటిఆర్ వ్యాఖ్యానించారు. 'సిరిసిల్లలో 117 పంచాయతీలకు గాను 80 చోట్ల బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలవడమే దీనికి నిదర్శనం. పల్లెలు బాగుపడాలన్నా, అభివృద్ధి జరగాలన్నా కెసిఆర్ నాయకత్వమే శరణ్యమని ప్రజలు మరోసారి తేల్చి చెప్పారు' అని అన్నారు. రాబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో కూడా ఇదే ప్రభంజనం కొనసాగిస్తామని చెప్పారు.